
# మళ్ళీ అమరావతి కథలు

## సత్యం శంకరమంచి

అల్లంత దూరాన మబ్బుల్ని తాకుతున్న గాలిగోపురం. ఆ వెనక సూర్యకిరణాల పలకరింపుకు మెరుస్తున్న బంగారు పూత అమరేశ్వ రాలయ శిఖరం. ఎత్తయిన ఆ శిఖరానికి చుట్టూతా ఎన్నో ఆలయాలు. ఎన్నెన్నో శిఖరాలు. తూర్పున వైకుంఠపురం కొండ, దక్షిణాన పాడుపడ్డ బౌద్ధ స్తూపాలు, పడమట ఈనాడు దిబ్బగామారిన అల్లప్పటి శాతవాహనులరాజధాని ధాన్యకటకం, ఉత్తరాన ఆ స్తూపాల్ని, ఆ దిబ్బల్ని, వాటి మధ్య వుండే ప్రజల్ని, ఆ ఊర్ని వడ్డాణంలా చుట్టి గలగలపారుతున్న కృష్ణానది, అద్గదీ అమరావతి!

అప్పటికీ, ఇప్పటికీ సాక్షి ఆ కృష్ణవేణి. గతాన్ని కడుపులో దాచుకుని ఏమీ తెలియనట్టు నిండుగా ప్రవ హిస్తోంది. కృష్ణమ్మ అమరేశ్వరుడి గుడి గోడలొరసి పారుతోంది. పరమేశ్వరుడికి పాదాభిషేచనం చేస్తూ ముందుకెళ్తోంది. అల్లంత దూరాన, సూరీడు రాతిరేళ పడుకునే చోటు నుంచి బయలుదేరి పరుగు పరుగున అమరావతి వైపుకొస్తున్నాడు. కన్ను సారించి చూస్తే రెండు కొండ కొమ్ముల మధ్య నుంచి వచ్చే కృష్ణ కావలసిన చుట్టం ఊరు నుంచి వస్తున్నట్టుంది. తుళ్ళి తుళ్ళి పారుతోంది. మళ్ళీ మళ్ళీ పారుతోంది. తలంటు పోసుకొని విప్పుకున్న జుట్టులా పాయలు పాయలుగా పారుతోంది. ఆ జుట్టుని బంధించి జడగా అల్లినట్టు ఏకపాయగా పారుతోంది.




శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ తమ పీఠికలో 'అమరావతి కథలు' అపురూప శిల్పాలు అని మెచ్చిన కొన్ని 'కథలను' ధారావాహికంగా పునః ప్రచురిస్తున్నాము. ('ముత్యాలవాన' శీర్షికలో).

—ఎడిటర్

ఒకనాడు గుర్రాలూ, రథాలూ తిరుగుతూండగా సైనిక విన్యాసాలు జరిగిన ఆ రాజవీథిలో ఇవ్వాళ కుక్కలూ, గాడిదలూ, మేత దండగని ఊరు మీద తోలేసిన సాంబయ్యగారి ముసలి ఎద్దూ నీరసంగా తిరుగు తున్నాయి. రత్నాల రాసులూ, ముత్యాల మూటలూ బళ్ళకెత్తుకు నడిపించిన ఆ వీథిలో ఇవ్వాళ పొట్టు బస్తాలు లాగుడు బండి మీద తొయ్యలేక తొయ్యలేక తోస్తున్నారు. అంత పెద్ద వీథి ఎవరు వూడ్చి శుభ్రం చేస్తారు? ఎవరిళ్ళ ముందు వాళ్ళు వూడ్చుకొని కళ్ళాపు జల్లుకొని కసువంతా నడిబజార్లో పోస్తారు. ఆ కసువు కుప్పల మీద కుక్కలు ముడుచుకుపడుకుంటే, ఇంకో పక్క కోళ్ళు, కోడిపిల్లలు ముక్కుల్తో కెలుకు తూంటాయి. ఒకనాడు భేరీలు మోగించే ఉత్తర గాలి గోపురంలో పిచ్చి సూరిగాడు పీలికలు కాళ్ళనిండా చుట్టు కొని గంజాయి దమ్ము లాగుతున్నాడు. ఆ విశాల వటవృక్షాల కింద ఒకనాడు శ్రవణ పర్వంగా వేదగానం వినిపిస్తే, ఇవ్వాళ "నా కొడకా! నా ముక్కుకి అడ్డొచ్చావు గదరా!" అంటూ పేకాట జోరుగా సాగుతోంది.

బౌద్ధ విశ్వవిద్యాలయంలో కొన్ని వేల మంది దేశ విదేశీ విద్యార్థులకు జ్ఞానోపదేశం చేసినచోట - దిబ్బలు, పాడు దిబ్బలు కన్పిస్తున్నాయి. దిగులుగా వున్న ఆ దిబ్బలమీద పందులు తిరుగుతున్నాయి. వాటిని అదిలిస్తున్న వడ్డెరోళ్ళ పోరగాళ్ళు కన్పిస్తున్నారు.

కృష్ణకి నీళ్ళకెళ్తున్న ఓ పడుచుపిల్ల ముత్యాల కాలిపట్టీ జారిపోతే "కంగారెందుకులే" అనుకుని ఆ పిల్ల కృష్ణలో నీళ్ళు ముంచుకుని ఆ బిందె ఇంట్లో పెట్టి తిరిగివస్తే ఆ ముత్యాల పట్టీ అక్కడే భద్రంగా వుండగా కాలికి తగిలించుకొని గునగున వెళ్ళిపోయిందట. ఇవ్వాళ కృష్ణకి నీళ్ళకెళ్తున్న చాలామంది ఆడపిల్లలకి కాలి పట్టీలు లేవు. అయినా గునగున నడిచిపోతూనే వున్నారు. ముఖాలు నవ్వుతూనే వున్నాయి గుండెల్లో ఎంత దిగులున్నా.

ఇంకా తెల్లారలేదు. దొడ్లల్లో హోరు, ఊళ్ళో హోరు. ఉన్నట్టుండి కృష్ణ పొంగింది. రాత్రికి రాత్రి వర దొచ్చింది. ప్రళయంగా పొంగింది. ఆ మసగ వెల్తుర్లో కృష్ణ గర్జిస్తూ ఇంకా పొంగుతోంది. దొడ్లల్లో నడు మెత్తునీళ్ళు వచ్చేశాయి. జనం గోల, హడావుడి, తోసు కోడాలు, మట్టిగోడలు విరిగి పడిపోతున్నాయి. గుడిపక్క వీథిలో వున్న ఇళ్ళు ఎత్తు మీద వున్నా దొడ్లో సామా నంతా రాత్రికి రాత్రే కృష్ణలో కలిసిపోయింది.

పల్లపీథి మూడొంతులు మునిగిపోయింది!

మిట్ట మీదికి నీళ్ళెక్కుతున్నాయి!

యానాదుల గుడిసెలు ఎగిరిపోయాయి!

కొట్టాల్లో పశువులు కట్టుగొయ్యల్తో సహా కృష్ణలో కలిసిపోయాయి!

రేవులో పడవలు గల్లంతు!

లాంచీలు లంగర్లు లాగేసుకుని ఎటోపడిపోయాయి!

తెలతెలవారుతూంటే కృష్ణమ్మ ప్రళయరూపం కన్పించింది. ఈ భూమిని మింగేద్దామన్నంత కోపంతో పొంగుతోంది. అవతలొడ్డు కానడంలేదు. ఎదురుగా జల సముద్రం, ఎగిరెగిరి పడ్తున్న అలలు. ఆ మహా ప్రవాహం మధ్యలో కొట్టుకుపోతున్న ఇళ్ళ కప్పులు, క్షణంలో ఆ కప్పు నీళ్ళలో కలిసిపోయింది. మోరలెత్తి అంబా అని అరుస్తున్న పశువులు కొట్టుకుపోతున్నాయి. మోరలు మునిగిపోతున్నాయి. ఆ వడిలో కొమ్ములు మునిగిపోతున్నాయి. కొట్టుకొస్తున్న దుంగలు, కలప. ఓ దుంగ మీద వూర కుక్కొకటి దీనంగా మొరుగుతోంది

## ముత్యాలవాన

రక్షించమని. ఆ వేగానికి దుంగ మెలికలు తిరుగుతుంటే తనూ గిరగిర తిరుగుతూ కాళ్ళు నిలదొక్కుకుంటోంది ప్రాణభయంతో వున్న కుక్క.

అంతలో ప్రవాహం మధ్య నుంచి ఓ మనిషి కేక. ''దేవుడోయ్! రక్షించండో'' అని గుండెలు వీల్చుకుపోయే కేక. క్షణంలో ఆ కేక దూరమైంది. మనిషి కన్పించలేదు. ఎవరూ ఏం చెయ్యలేదు. సాయానికి ఎవరైనా వెళ్తే ఆ వడికి తిరిగి రాలేరు. నిస్సహాయంగా ఆ భీభత్స భయానక దృశ్యాల్ని చూస్తున్నారు ఒడ్డున నుంచున్న జనమంతా. అందరి గుండెల్లో భయం.

ఇళ్ళ ముందుకు నీళ్ళు రావడంతో పిల్లలంతా కాగితం పడవలాట లాడుకుంటున్నారు. పడవలు చేసిపెట్టమని పెద్దల్ని వేధిస్తున్నారు. స్కూలు పిల్లలు గోడమీద బొగ్గు గీతలు గీసి క్షణక్షణం పెరుగుతున్న నీటి మట్టాన్ని కొలుస్తున్నారు.

''పల్లపీధిలో అర్ధరాత్రేళ సంగయ్యింట్లో పసిపిల్లకి తడితగిలి అదేడిస్తే లేవాడంటయ్యా! అప్పటికే గోడలిరిగె. నీళ్ళు తోసుకొచ్చె! పెళ్ళం పిల్లలూ పానాల్తో బయట కొచ్చారంట!''

''మిట్టమీది ఎంకటసామి మేకల మందంతా కొట్టుక పోతుంటే ఏం చెయ్యలేక చూస్తూ నుంచున్నాట్టయ్యా!''

''సాలెపేటలో వరదలో కొట్టుకొచ్చిన పాము ఇంట్లో దూరి సుబ్బయ్యని కరిచిందంట!''

''లంకల్లో మేతకెళ్ళిన గొడ్లు, పాలేళ్ళు ఏమయి నారో?''

ఇలా భయంకరమైన కథలు చెప్పుకొంటున్నారు. కొందరు ఇల్లాళ్ళు కృష్ణమ్మని శాంతించమని పసుపు, కుంకుమ అర్పించి కొబ్బరి కాయలు కొడ్తున్నారు. పిల్లలు కొబ్బరి ముక్కల కోసం ఎగబడ్తున్నారు. ఊరు సగం మునిగిపోయింది. దొరికిన సామాన్లతో జనమంతా ఊరి మధ్య వున్న మాలక్ష్మమ్మవారి చెట్టు దగ్గర చేరారు. చంటిపిల్లలకి చెట్లకే ఉయ్యాలలు వేశారు. పది గంటల వేళ వరద తగ్గుముఖం పట్టింది.

వూళ్ళో పెద్దలు వెంకటస్వామి, వీరాస్వామి, అవధాన్లు అంతా మాలక్ష్మమ్మవారి చెట్టుదగ్గర కొచ్చారు.

''ఇప్పుడేం చేద్దాం? ఏం చేద్దాం?'' అని తలపట్లు పట్టుకున్నారు.

''చేసేదేముందయ్యా? ముందీ జనానికి తిండీ తిప్పలూ చూడండి'' అన్నారెవరో.

క్యాసెట్ గెలుపొందిన కవిత

## సందిగ్ధం

దగ్ధమయిపోతున్న యీ జీవితమే
ఒకప్పుడు నను ముగ్ధుణ్ణి గావించింది!

అపుడు-
రెండు పదుల వయసులో
నిండుదనం రాని మేధస్సుతో
ఆవేశం కట్టిన అంచనాంతో
ఆశించే మార్పు అతి త్వరలో
అనివార్యంగా భావించి
ఆచరణతో శ్వాసించి

మరో ప్రపంచపు దారులు తెరవాలని
సమతా ద్వారాల ముంగిట నిలచి
స్వాగత గీతాలు పలకాలని
సాహసం ప్రవృత్తిగా
జీవితం కొవ్వొత్తిలా
మెలగి వెలిగిన రోజులలో...
ఈ జీవితమే నను ముగ్ధుణ్ణి గావించింది!

ఇపుడు-
నా వయసు నాలుగు పదులు
నా నివాసం చీకటి గదులు
మూల విశ్వాసాలేమీ చెక్కు చెదరకపోయినా
పోరాట పటిమ కొరవడకపోయినా
ఈ ఇరవై ఏళ్ళ అనుభవం నేర్పిందేమిటి?
ఇరవై ఒక్క శాఖలుగా చీలిపోయి
విడివిడిగా ఆలోచిస్తుందేమిటి?

ఆచరణా వైఫల్యాల గురించి
అనైక్యతా వైరుధ్యాల గురించి
అంతర్గత కల్లోలాల ఆవేశాల నుంచి
నేను నేర్చిందేమిటి?
వర్తమానం నుంచి భవిష్యత్‌కు మిగిల్చిందేమిటి?

ఆవేదనాగ్నిలో అల్లే కవితలు తప్ప
ఆర్తితో మూర్తీభవించిన ముఖాన్నిచూపడంతప్ప?
దగ్ధమయిపోతున్న యీ జీవతమే
ఇపుడు నను సందిగ్ధంలో పడేసింది!!

కామిశెట్టి శివశంకర్

అంతే! పది మంది కుర్రాళ్ళు గడ్డపారలు తీసుకుని గాడిపొయ్యి తవ్వేశారు. ఇంకో పదిమంది గోతాలు తీసుకుని ఇంటింటికీ వెళ్ళి బియ్యం వసూలు చేశారు. కోటలో వంట సామగ్రి తెచ్చారు. పప్పూ ఉప్పూ నెయ్యి, నూనె వాటంతట అవే వచ్చాయి. ఎసట్లో బియ్యం పోశారు. వంట నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు, శోభనాద్రి ''ఇహ కూరలే ఆలస్యం'' అన్నారు. అవధాన్ల గారి భార్య, కోమటి సూరమ్మ, తెలగ వెంకమ్మ, గొల్ల సుబ్బమ్మ కత్తిపీటలు ముందేసుకుని చకచక కూరలు తరిగేశారు. పన్నెండు గంటలకల్లా దోసకాయ పప్పు, పులుసు అన్నం తయారయిపోయాయి.

సెట్టిగారు విస్తళ్ళ కట్టలిస్తే నడిబజారులో బారులుగా విస్తళ్ళు వేశారు. శాస్త్రిగారు సంధ్యావందనం ముగించుకుని తనూ ఓ విస్తట్లో కూర్చున్నాడు. ఇటు ప్రక్క చూస్తే తెలగ సుబ్బారాయుడున్నాడు. ఇంకో పక్క గొల్ల రాములున్నాడు. ఎవరిపక్క ఎవరున్నారో ఎవరికీ పట్టలేదు. భగవన్నామ స్మరణలు సాగుతున్నాయి. వడ్డనలయిపోయాయి. శాస్త్రిగారు అవుపోసనపట్టి, నెయ్యి కోసం చెయ్యి జాస్తే వడ్డించడానికి వచ్చిన నేతి జాడీ చెంగున వెనక్కు వెళ్ళింది. వడ్డిస్తున్న మాల సంగడు శాస్త్రిగారికి వడ్డించడం ఇష్టంలేక పారిపోతున్నాడు. శాస్త్రిగారు ''ఒరే సంగా!'' అని పెద్దగా కేకపెట్టే, భయం భయంగా వచ్చిన సంగణ్ణి చూసి ''ఒరే సంగా! నీకూ ఆకలేస్తుంది, నాకూ ఆకలేస్తుంది. ఇంకొకళ్ళు వేస్తే నెయ్యి, నువ్వు వేస్తే నెయ్యి కాకపోదురా ... వెయ్యరా'' అన్నాడు. చెయ్యి ముందుకు చాపి. సంగడు ఆనందంగా వడ్డించాడు. ''నమః పార్వతీ పతయే'' అన్న కేకలు దేవాలయ శిఖరాల్నంటాయి.

వరదొచ్చి మనుషుల మనసులు కడిగేసిందనుకుందామా? అబ్బే! నాకు నమ్మకం లేదు! స్నానం చేసిన ఒంటికి తెల్లారేప్పటికి మళ్ళీ మట్టి పట్టినట్టు మనసుల్లో మళ్ళీ మలినం పేరుకుంటోంది. ఎన్ని వరదలొచ్చినా మనిషి మనసు కడగలేకపోతోంది.

